
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం, 31 ఆగస్టు 2025



మా భూములకు దిక్కెవరు?

- సాగు భూముల్లో అటవీ అధికారుల ట్రెంచ్
- భూముల పంచాయితీ తేలకుండానే అభివృద్ధి పనులా?
- ఇచ్చిన భూములను లాక్కుంటారా?
- ప్రత్యామ్నాయం చూపాలని జమలాపురం రైతుల ఆవేదన

7



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

అంతా వరుణుడిపైనే భారం

- రెండు రోజుల పాటు నీటిమట్టం తగ్గే అవకాశాలు తక్కువంటున్న అధికారులు
- ఎగువన వర్షాలు పడితే ఇబ్బందికర పరిస్థితులు?
- నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి
- భద్రాచలం వద్ద 47.5 అడుగుల నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవాహం

భద్రాచలం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన భారీ వర్షాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నెమ్మదిగా పెరుగుతోందని, ఎగువన వర్షాలు పడితే పరిస్థితులు ఆందోళనకరంగానే ఉంటాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అంతా వరుణుడిపై ఆధారపడి ఉందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు 45 అడుగులకు చేరుకున్న నీటిమట్టం శనివారం ఉదయం 6 గంటలకు 46.5 అడుగులకు, 9 గంటలకు 46.9 అడుగులు, 12 గంటలకు 47.2, ఒంటి గంటకు 47.3 అడుగులకు పెరిగింది. అనంతరం కొద్దిసేపు నిలకడగా ఉండి.. మళ్లీ సాయంత్రం 4 గంటలకు 47.4 అడుగులకు, 7 గంటల నుంచి 47.5 అడుగులవద్ద గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 11,19,275 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన ఉన్న భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు వద్ద ఉదయం నుంచి నీటిమట్టం కొద్దిసేపు నిలకడగా ఉండి తగ్గుముఖం పట్టగా మళ్లీ మధ్యాహ్నం నుంచి స్వల్పంగా పెరుగుతుండటంతో భద్రాచలం వద్ద కూడా నీటిమట్టం స్వల్పంగా పెరిగే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రాత్రి సమయానికి మరో అడుగు మేర నీటిమట్టం పెరగవచ్చని వారు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 48 అడుగులకు చేరువవుతుండగా.. రెండోరోజూ స్నానఘట్టాలు దేవస్థానం కల్యాణ కట్ట దిగువభాగం నీట మునిగే ఉన్నాయి. అలాగే దుమ్ముగూడెం మండలంలోని సీతమ్మ నార చీరల ప్రాంతం, సున్నంబట్టి - బైరాగులపాడు మధ్య వరద నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలకు రెండో రోజు (మిగతా 6వ పేజీలో)

సమగ్ర.. స్వాహా!

- ఔట్ సోర్సింగ్‌తో సమగ్ర శిక్షా అభియాన్‌లో గణాంకాల విభాగం నిర్వహణ
- పని చేసే వారిలో 80శాతం ఆ సిబ్బందే..
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఉమ్మడి జిల్లాలో రూ.1.90కోట్లు మాయం
- అతి కష్టం మీద తిరిగి స్వాధీనం
- సమ్మర్ స్కూళ్ల నిధులు రూ. 25 లక్షలు వెనక్కి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టించుకునే వారు కరువై.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక.. సమగ్ర శిక్షా అభియాన్‌లో స్వాహా పర్వం కొనసాగుతోంది. 'సమగ్ర శిక్షలో కోట్లాది రూపాయల లావాదేవీలన్నీ గణాంక విభాగం ఆధ్వర్యంలో జరుగుతాయి. ఇక్కడ పనిచేసే వారిలో 80శాతం మంది సిబ్బంది అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారే.. రాష్ట్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు గణాంకాల విభాగంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందే ఉన్నారు. అధికారుల పట్టింపు కరువవడంతో.. వీరంతా ఇష్టారాజ్యంగా పని చేస్తున్నారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షకులుగా ఉంటారు. నిత్యం అనేక విద్యా సమస్యలతో సతమతమయ్యే డీఈఓకు గణంకాల ఉద్యోగుల ప్రవర్తన తలనొప్పిగా మారింది. వీరి నిర్వాకం వల్ల చివరకు ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల విద్యాశాఖాధికారులకు పెన్షన్ కూడా నిలిపి వేశారు. ఎవరో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేసిన పనికి ఇద్దరు డీఈవోలు బలి పశువులయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్ర శిక్షా అభియాన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిర్వాకం వల్ల దాదాపు రూ. 1.90 కోట్లు దారి మళ్లాయి. ఖమ్మం పరిధిలో రూ. 1.50 కోట్లు, కొత్తగూడెం పరిధిలో సుమారు రూ. 40లక్షలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వల్ల దారి మళ్లాయి. దీంతో ఉన్నతాధికారులు ఏడాది పాటు విచారణ పేరుతో కాలయాపన చేశారు. చివరకు డీఈవోల పర్యవేక్షణ లోపం వల్లే ఈ తప్పిదం జరిగిందంటూ అధికారులు చార్జీషీట్స్ ఇచ్చారు. అయితే డబ్బులు తీసుకున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చనిపోడంతో ఎవరిని అడగాలో తెలియక అధికార యంత్రాంగం తల పట్టుకున్నారు. చివరకు ఖమ్మం కలెక్టర్ చొరవతో మరణించిన అవుట్ సోర్సింగ్ కుటుంబం ద్వారా తిరిగి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమకట్టడం జరిగింది.

వెనక్కి వెళ్లిన సమ్మర్ స్కూల్స్ సొమ్ములు

2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన సమ్మర్ స్కూల్స్ నిధులను ఎవరూ డ్రా చేయకపోవడంతో ఈ నిధులు తిరిగి రాష్ట్ర ఖజానాకు చేరినట్లు తెలిసింది. సరైన ప్రణాళిక లేకుండా జిల్లాలో వేసవి కాలంలో 50 పాఠశాలలు పని చేశాయి. విద్యార్థులకు వివిధ రంగాల్లో తర్ఫీదు ఇవ్వడం కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ పాఠశాలలు నిర్వహణ తీరులో విఫలమయ్యాయనే ఆరోపణలు లేకపోలేదు. ఒక్కో పాఠశాలకు రూ. 50వేలు కేటాయించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత ఈ నిధులను విడుదల చేశారు. జిల్లాలో 50 పాఠశాలలకు గాను రూ. 50లక్షలు మంజూరయ్యాయి. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఈ నిధులు తిరిగి వెళ్లిపోయాయి. కనీసం బిల్లులు సమర్పించిన హెచ్ఎంలకు కూడా బ్యాంకు ఎకౌంట్స్‌లో డబ్బులు జమకాకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమన్వయ లోపం.. హెచ్ఎంలకు శాపంగా మారింది. మరోవైపు.. తాము తాము ఖర్చు చేసిన నిధులు వెంటనే ఇవ్వాలని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలు కోరుతున్నారు.

పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఔట్ సోర్సింగ్!

సమగ్ర శిక్షా అభియాన్‌లో గణాంకాల విభాగంలో పని చేసే ఉద్యోగుల్లో 80శాతం ఔట్‌సోర్సింగ్ వారే. కోట్లాది రూపాయల లావాదేవీలు ఔట్‌సోర్సింగ్ ద్వారానే జరుగుతుంటాయి. రాష్ట్రస్థాయిలో ఫైనాన్స్ కంట్రోలర్‌గా ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఉంటారు. ఆయన కింద డీడీఓలు ఉంటారు. ట్రెజరీ విభాగాలకు చెందిన ఉద్యోగులు డిప్యూటేషన్‌పై డీడీఓ పోస్టుల్లో పని చేస్తారు. డీడీఓల కింద అసిస్టెంట్ అకౌంట్స్ ఉద్యోగులు ఉంటారు. ప్రస్తుతం ఈ పోస్టుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటున్నారు. రెండు మూడు జిల్లాలకు రాష్ట్రస్థాయిలో (మిగతా 6వ పేజీలో)

స్థానికానికి కసరత్తు!

- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు చేరిన జంబో బ్యాలెట్ బాక్సులు
- 42శాతం రిజర్వేషన్‌తో ముందుకెళ్లే యోచనలో ప్రభుత్వం

ఖమ్మం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో సానుకూలంగా నిర్ణయం తీసుకోగా.. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తు చేస్తుండటంతో సందడి కనిపిస్తోంది. సెప్టెంబరు నెలలో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జోరందుకుంది. రాష్ట్ర మంత్రి వర్గం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తోపాటు ఎస్సీ, ఎస్టీలకు కూడా తాజా జనాభా లెక్కల ప్రకారం వారి రిజర్వేషన్‌ను అమలుచేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఎన్నికలకు షెడ్యూల్ త్వరలోనే విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు గతంలో జిల్లాలో ఉన్న బ్యాలెట్ బాక్సులకు అదనంగా మహారాష్ట్రలోని నాగపూర్‌నుంచి 300, గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి 2300 జంబో బ్యాలెట్ బాక్సులను ఖమ్మం జిల్లాకు కేటాయించడంతో.. వాటిని జిల్లా యంత్రాంగం తీసుకువచ్చి భద్రపరిచింది.



ఖమ్మం చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ, ప్రాదేశికాలకు ఒకేసారి ఎన్నికలు?

జంబో బ్యాలెట్ బాక్సులు ప్రతీ జిల్లాకు కేటాయించడంతో పంచాయతీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. గతంలో పంచాయతీ ఎన్నికలకు ఓసారి కసరత్తుచేయగా ఆతర్వాత మండల, జిల్లాపరిషత్ ఎన్నికలు జరుగుతాయన్న సమాచారంతో ఆ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డు, సర్పంచ్ అభ్యర్థుల బ్యాలెట్లను ముద్రించారు. ఎన్నికల సిబ్బందిని నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో 571 గ్రామ పంచాయతీలు, 5,214వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి గతంలో 3146 బ్యాలెట్ బాక్సులు ఎన్నికలయంత్రాంగం సిద్ధం చేయగా కొత్తగా 2,600జంబో బ్యాలెట్ బాక్సులు మహారాష్ట్ర, గుజరాత్ నుంచి రావడం ద్వారా ఒకేసారి పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. తద్వారా ఎన్నికల ఖర్చులు కూడా తగ్గనున్నాయి. ఏపీలో గత ప్రభుత్వం ఒకేసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ (మిగతా 6వ పేజీలో)



ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

పింఛన్లపై తేల్చుకుంటాం..

- పెంచుతారా? రాజీనామా చేస్తారా? సీఎం రేవంత్ చెప్పాలి
- వచ్చేనెల 9న హైదరాబాద్‌లో వికలాంగుల మహాగర్జన
- చంద్రబాబును చూసి రేవంత్, కేసీఆర్ నేర్చుకోవాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

నేలకొండపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల పింఛన్లనె పెంచే విషయంపై వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే వికలాంగుల మహాగర్జనలో తేల్చుకుంటామని, పింఛన్లు పెంచడమా?లేదంటే సీఎం పదవికి రాజీనామా చేయడమా అనేది రేవంత్‌రెడ్డి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. మహాగర్జన సన్నాహకాల్లో భాగంగా శనివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టెకోల వెంకటేశ్వర్లు అధ్యక్షతన (మిగతా 6వ పేజీలో)

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్
- చిన్నమునగాలలో పంటలను పరిశీలించిన నేతల బృందం



చిన్నమునగాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

కొణిజర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం కొణిజర్ల మండలంలోని చిన్నమునగాల గ్రామంలో రైతులు, రైతుసంఘం నాయకులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు పెసరపంటను పూర్తిగా దెబ్బతీశాయని, ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పెసర ఎందుకు పనికిరాకుండా పోయిందన్నారు. పత్తి ఇతర పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కౌలు రైతులు ముందస్తుగా ఎకరాకు రూ. 20వేలు నుంచి రూ. 30వేలు చెల్లింపు చేసి ఉన్నారని, వారంతా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సమగ్రసర్వే చేసి నష్టపోయిన ప్రతీ రైతు, కౌలురైతుకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను సకాలంలో సరఫరా చేయటంలో కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని, రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా యూరియా సరఫరా చేసే బాధ్యతను రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, రైతుసంఘం నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు నరసింహారావు, చెరుకుమల్లి పురుషోత్తం, కరుణాకర్, పులి నరసింహారావు, ఐనాల రాజేష్, దమ్మాలపాటి మురళి, ప్రసాద్, మధు, శ్రీను తదితరులున్నారు.



ఇక 'పరిషత్' వంతు..

- ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకటనకు షెడ్యూల్ విడుదల
- సెప్టెంబరు 10న తుది జాబితా ప్రకటన

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రదర్శనకు ఉంచారు. ఇక పరిషత్ ఓటర్ల జాబితా వంతు వచ్చేసింది. పంచాయతీల జాబితా ఆధారంగానే పరిషత్ ఓటర్ల వివరాలను సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు శనివారం సాయంత్రం షెడ్యూల్ విడుదలైంది. ఈ క్రమంలో జిల్లాలో పరిషత్ ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసి సెప్టెంబరు 6న ప్రదర్శనకు పెట్టనున్నారు. 8న జిల్లా, మండలస్థాయిలో అన్ని రాజకీయ పార్టీలతో సమీక్షిస్తారు. 9న గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా అభ్యంతరాలను స్వీకరిస్తారు. అదేరోజున వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి 10న తుది జాబితాను ప్రకటించనున్నారు. జిల్లాలో 20మండలాల్లో 283 ఎంపీటీసీ స్థానాలుండగా.. వాటిపరిధిలో 20 ఎంపీపీ, 20 జడ్పీటీసీ స్థానాలున్నాయి. వీటి పరిధిలో 1572 పోలింగ్ కేంద్రాలున్నాయి. 590 పోలింగ్ లోకేషన్లున్నాయి. పంచాయతీ ముసాయిదా జాబితా ప్రకారం 8,02,690 మంది ఓటర్లున్నారు.

పంటల నమోదుకు శ్రీకారం

- మంత్రి తుమ్మల ఆదేశాలతో కదలిక
- ఏఈవోలకు అందిన క్రాప్ బుకింగ్ యాప్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైరా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో పంటల నమోదు ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది. అయితే ఈఏడాది పంటల నమోదు ప్రక్రియ చేపట్టడంలో జరిగిన జాప్యంపై ఈనెల 26న 'పంటల నమోదు ఎప్పుడో' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన మంత్రి తుమ్మల వెంటనే పంటల నమోదు ప్రక్రియను ప్రారంభించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దాంతో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి గురు, శుక్రవారాల్లో పంటల నమోదు యాప్‌లను క్షేత్రస్థాయిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో)కు అందాయి.దాంతో వారు వెంటనే పంటల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. శనివారం వైరా మండలంలోని తాటిపూడి, సోమవరం గ్రామాల్లో ఏవో మయాన్ మంజూఖాన్ ఆధ్వర్యంలో ఏఈవో రాజేష్ క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ డిజిటల్ క్రాప్ సర్వే చేశారు. మే చివర్లో కురిసిన వర్షాలతో ముందుగానే రైతులు పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలను, జూలై, ఆగస్టుల్లో వరి ఇతర పంటలను సాగుచేశారు.ఇప్పటికే పెసర, మినుము, మొక్కజొన్న పంటలు రైతుల చేతికొచ్చాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెసర పంట 50శాతానికిపైగా దెబ్బతిన్నది. మిగిలిన కొద్దిమొత్తం పంటను రైతులు యంత్రాలతో కోయిస్తుండగానే మళ్లీ ఐదారురోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మిగిలిన పంట కూడా పనికిరాకుండాపోయింది. రైతు చేతికొచ్చిన పెసలు ఇతర ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఏఈవోలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి పంటల నమోదు జరుగలేదు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. వెంటనే మంత్రి తుమ్మల స్పందించి పంటల నమోదును ప్రారంభించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. పంటల నమోదు యాప్ రావడంతో క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించారు. ఈ పంటల సూక్ష్మ పరిశీలనతో రైతులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ముఖ్యంగా తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌యార్డుల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొనే సమయంలో పంటల నమోదు ఎంతో అవసరంగా ఉంది. ఆన్‌లైన్‌లో నమోదైన పంటల మేరకు ఏఈవోలు రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. రైతులకు ఇవి ఎంతో దోహదపడతాయి. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన సమయంలో ప్రభుత్వం అందించే నష్టపరిహారాన్ని రైతులు పొందేందుకు పంటల నమోదు తోడ్పడుతుంది. అంతేకాకుండా ఏఈవోలు రైతులు సాగుచేసిన పంటలను విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. దీనివలన రైతులకు తమ ఉత్పత్తులు విక్రయించుకొనే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌలభ్యంగా ఉంటుంది.



తాటిపూడిలో క్షేత్రస్థాయిలో పంటల నమోదు చేస్తున్న ఏవో మంజూఖాన్, ఏఈవో రాజేష్



ఎండలకు తాళలేక చెప్పులు క్యూలో పెట్టిన దృశ్యం


ఆళ్లపల్లిలో యూరియా కట్టల కోసం లైన్‌లో ఉన్న రైతులు

యూరియా కోసం రైతుల పాట్లు..

- వచ్చింది వందల మంది.. ఇచ్చింది 80 మందికి
- ఆళ్లపల్లి మండలంలో రైతుల బారులు

చంద్రుగొండ/ఆళ్లపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్‌లో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చంద్రుగొండ మండలంలో గానుగపాడు, గుంపెన సహకార సంఘాలు ఉన్నా.. యూరియా కొరత మాత్రం తీరటంలేదు. వ్యవసాయ అధికారులు మాత్రం వందల టన్నులు పంపిణీ జరిగిందని వివరణ ఇస్తున్నారు. ఈ క్రమంలో శనివారం గానుగపాడు సహకారం వద్ద యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున క్యూ లైన్‌లో వేసి ఉన్నారు. 80బస్తాలు మాత్రమే నిల్వ ఉండగా వందలాది మంది రైతులు యూరియా కోసం తరలి వచ్చి గంటల తరబడి ఎండలో నిలబడలేక చెప్పులు క్యూలో ఉంచి కార్యాలయ భవనం నీడ, సమీపలోని చెట్ల కింద నిరీక్షించారు. దీంతో అధికారులు పోలీసుల రక్షణ మధ్య ఒక్కొక్క బస్తా చొప్పున 80మంది రైతులకు పంపిణీ చేశారు. దీంతో మిగతా రైతులు అసహనంగా వెనుతిరిగారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి వినయ్ మాట్లాడుతూ మండల రైతులకు ఈ సీజన్‌కు 20వేల బస్తాలు సరిపోతాయని, సహకార సంఘాలు, డీలర్ల ద్వారా ఇప్పటికే 19వేల బస్తాల యూరియా రైతులకు చేరిందని తెలిపారు.

ఆళ్లపల్లి మండలంలోని రైతులు యూరియా బస్తాల కోసం శనివారం బారులు తీరారు. శేలగట్టు వద్ద కో ఆపరేటీవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా గోదాం వద్ద సుమారు 400 మంది రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పుస్తకాలను వరుస క్రమంలో పెట్టి బారులు తీరారు. వర్షం వస్తున్నపటికీ ఆధార్, పట్టా పుస్తకాలు తడవకుండా పైనుంచి ఆకులు పెట్టి లైన్‌లో ఉన్నారు. యూరియా కట్టల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు లైన్‌లో ఉంటే మూడు కట్టలు పొందడం గగనంగా మారిందని రైతులు అంటున్నారు. పనులన్నీ వదిలేసుకోని వస్తే, వచ్చిరాని కట్టలు ఇవ్వడంతో రోజుల తరబడి లైన్‌లో ఉండాల్సి వస్తుందని, ఇప్పటికే మొక్కజొన్న చివరిదశలో ఉంది. యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. యూరియా అందని రైతులకు సోమవారం ఇస్తామని అధికారులు తెలిపారు. యూరియా వద్ద ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ఆళ్లపల్లి పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో 90శాతం గెలుచుకుంటాం

- 10, 11 తేదీల్లో కేటీఆర్ బహిరంగ సభలకు తరలిరండి
- ముగ్గురు మంత్రులూ.. తమకొచ్చిన సీట్లను తెచ్చుకోండి చూద్దాం
- కష్టపడిన వారికే పదవులు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


అశ్వారావుపేటలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రేగా కాంతారావు

అశ్వారావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక ఎన్నికల్లో జడ్పీ చైర్మన్‌తోపాటు 90శాతం స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు ప్రకటించారు. శనివారం అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గురుకులాలు, వరద బాధితులను ఆదుకోవడం, అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారని, వచ్చే స్థానిక ఎన్నికల్లో తమకంటే ఎక్కువ సీట్లు తెచ్చుకోలేరని ఎద్దేవా చేశారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అన్నారు. ఆ హామీ ఏమైపోయిందని నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ వారికే ఇచ్చుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని, అలాంటి వారు పేర్లు నమోదు చేసుకోవాలని, అధికారంలోకి వచ్చాక వారి భరతం పడతామన్నారు. సెప్టెంబరు 10, 11 తేదీల్లో జిల్లాలో జరిగే కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని, కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి, సెంటర్‌లైటింగ్, సీసీ రహదారులు వంటి పనులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే మంజూరు చేశామని, ఈ ప్రభుత్వం వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో యూఎస్ ప్రకాశరావు, జల్లిపల్లి శ్రీరామమూర్తి, మందపాటి రాజమోహన్ రెడ్డి, రావు జోగేశ్వరరావు, సంక ప్రసాదరావు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి, వైద్యాధికారులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సంగీత సత్యనారాయణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని రాష్ట్ర వైద్యకుటుంబ ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో అమలవుతున్న వైద్య కార్యక్రమాలపై ఆమె సమీక్షించారు. మాతా శిశు మరణాలు లేకుండా సుఖకాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమాలతోపాటు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించాలన్నారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టం, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం, నెలవారీ నివేదికలపై ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వోతోపాటు జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ రామారావు, సుబ్రహ్మణ్యం, డీపీహెచ్ఎన్‌వో శేషు, పద్మ, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, డీడీఎం నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సయ్య పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం

- సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వాలు అమలు చేయాలి
- టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వీ కృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు కృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటం లేదని కార్మికులు హక్కుగా పోరాటాలు చేయాలని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వీ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల నుంచి వెట్టి చాకిరి చేయించుకునేందుకు ప్రభుత్వాలు, పాలకవర్గాలు చూస్తున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు సిస్టమ్‌ను అందుకే అమలులోకి తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వం చేర్చుకుందన్నారు.వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నాన్ మాస్టర్ రోల్(ఎన్ఎంఆర్) పద్ధతిలో నియామకం చేసి తర్వాత రెగ్యులర్ చేశారని, ఇప్పుడు అటువంటి విధానం ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు.

2016లోనే భారత సుప్రీంకోర్టు పంజాబ్ కాంట్రాక్ట్ కార్మికులు వేసిన పిటీషన్‌పై విచారణ జరిపి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఒకే పని చేసే వారికి వేర్వేరు వేతనాలు ఇవ్వటం, తక్కువగా వేతనాలు ఇవ్వటం సరికాదని తీర్పును వెలువరించినట్లు పేర్కొన్నారు. ప్రపంచంలోనే సంక్షేమ ప్రభుత్వంగా భారతదేశానికి పేరు ఉందని, అటువంటి దేశంలో ఉద్యోగులు, కార్మికుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలోకి మూడో సారి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులపై కనీస చిత్తశుద్ధి చూపటం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆశ, అంగన్వాడీ, కేజీబీవీ, ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్, యూనివర్సిటీలు, ప్రభుత్వ హాస్పటల్స్ వైద్య కళాశాలలు అన్ని రంగాల్లో కార్మికులు వెట్టి చాకిరికి గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం దక్కే వరకు టీయూసీఐ కార్మికులు, ఉద్యోగుల పక్షాన ఉండి పోరాటాలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జీ రామయ్య, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, కే శ్రీనివాస్ మాట్లాడారు.

సింగరేణి ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులకు పదోన్నతులు

ఒకటి నుంచి అమలు చేసేవిధంగా చర్యలు : డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు


డైరెక్టర్(పా) గౌతమ్‌పోట్రు

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్ (ఎన్‌సీడబ్ల్యూ) ఉద్యోగులకు మూడు పద్ధతుల్లో పదోన్నతులు కల్పిస్తామని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్‌పోట్రు ఆదేశించినట్లు జనరల్ మేనేజర్ (పర్సనల్) కవితానాయుడు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 356 మంది ఉద్యోగులకు పదోన్నతుల పత్రాలను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకటి నుంచి అందాల్సిన క్యాడర్ స్కీం పదోన్నతి పత్రాలను పంపిణీ చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండ చూడాలని ఆదేశించారు. సింగరేణి వ్యాప్తంగా పదోన్నతులు పొందే 356 మంది వివరాలు ఏరియాల వారీగా ఇలా ఉన్నాయి. కొత్తగూడెం ఏరియా 35 మంది, ఇల్లెందు ఏరియా 13, మణుగూరు ఏరియా 26, రామగుండం-1లో 25, రామగుండం ఏరియా-2లో 41, రామగుండం ఏరియా -3లో 16 మంది, భూపాలపల్లి ఏరియాలో 42 మంది, శ్రీరాంపూర్ ఏరియాలో 68 మంది, మందమర్రి ఏరియాలో 40, బెల్లపల్లి ఏరియాలో 11, ఎస్టీపీపీలో 7 పోస్టులు ఉన్నట్లు ప్రకటించారు.

గడ్డోరుగట్టలో పోడు వివాదం

- దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధిలో ఉద్రిక్తత
- ఇరువర్గాల ఫిర్యాదులు


మొక్కలను తొలగించారంటున్న ఆదివాసీలు, పోడు భూమిలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

దుమ్ముగూడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధిలోని మరోమారు పోడు వివాదం చెలరేగింది. గడ్డోరుగట్టలో పోడుసాగుదారులు, అటవీశాఖ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. 17హెక్టార్ల అటవీభూమిలో ఈనెల 29న నాటిన 4500 వెదురు మొక్కలను పోడుసాగుదారులు తొలగించారని, పరిశీలించేందుకు వెళ్లగా శనివారం తమపై రాళ్లు, కర్రలతో దాడులు చేశారని రేంజ్ అధికారి కమల తెలిపారు. గతంలో మూడుసార్లు తాము నాటిన 11వేల మొక్కలను తొలగించారని, తాజాగా శనివారం మరోసారి తమపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దాడిలో ఇద్దరు ఎఫ్‌బీవోలు, ఒక బేస్‌క్యాంపు వాచర్లు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. తమపై ఇప్పటికే రెండుసార్లు భౌతిక దాడులు చేశారని, ఇది మూడోసారి అన్నారు. ఈ సంఘటనపై రేంజ్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తాము ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూమిలో నాటిన పత్తి మొక్కలను అటవీశాఖ అధికారులు అన్యాయంగా తొలగించారని గడ్డోరుగట్ట పోడుసాగుదారులు పోలీసులను ఆశ్రయించారు. అటవీహక్కు చట్టం ప్రకారం పోడుసాగులో ఉన్న మొక్కలను తొలగించడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, సంబంధిత అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేయడంతో జాయింట్ సర్వేకు ఆదేశించారని, అంతలోనే ఆదివాసీలను కొట్టడం, బెదిరింపులకు దిగడం, మొక్కల్ని తొలగించడం చేస్తున్నారని ఆరోపించారు.

అంతా వరుణుడిపైనే భారం


కల్యాణకట్ట కిందిభాగం నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


భద్రాచలం వద్ద గోదావరి


భద్రాచలం-కూనవరం రహదారిలో మురుమూరు వద్ద రహదారిపై చేరిన నీరు

(5వ పేజీ తరువాయి)

అంతరాయం కలిగింది. అదేవిదంగా తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డుపై వరద నీరు చేరడంతో శనివారం ఉదయం నుంచి రాకపోకలు స్తంభించాయి.

పూర్తి అప్రమత్తత

గోదావరి భద్రాచలం వద్ద వరద ప్రవాహం రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉన్న క్రమంలో పూర్తి అప్రమత్తతతో ఉన్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం చెబుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలోని మండలాల్లోని అధికారులు తమ గమ్యస్థానాల్లో బాధ్యతలు నిర్వహించేలా ఇప్పటికే కలెక్టర్ జితేష్‌వి పాటిల్, భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట దిశా నిర్దేశం చేశారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిపెట్టండి

వీడియో కాన్ఫరెన్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

రాష్ట్రంలో అధిక వర్షాలు కురుస్తున్న క్రమంలో వరదల తాకిడికి ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ పరిధిలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి అలుగు వర్షిణి, గురుకుల ప్రిన్సిపల్ సెక్రటరీ సీతాలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ సర్వేష్‌రెడ్డి, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ దివ్యకుమారితో కలిసి రాష్ట్రంలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్య పరిరక్షణ కోసం అన్ని విద్యా సంస్థల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం శుభ్రంగా వండాలని వంట సిబ్బంది తిన్న తరువాతే పిల్లలకు ఇవ్వాలని, అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమయంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్ భద్రాచలం ఐటీడీఏ పరిధిలో వరద కంట్రోల్ రూముతో పాటు హెల్ప్‌లైన్ డెస్కు ఏర్పాటు చేశామని మంత్రికి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు.

ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీకి శ్రీకారం

- కలెక్టర్ ఆదేశాలతో ప్రయోగాత్మక కార్యక్రమం
- డ్వాక్రా మహిళలకు తయారీ విధానాన్ని చూపిన అధికారులు


ఇటుకల తయారీని చూపుతున్న అధికారులు

మణుగూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు మండలం లోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యాష్ పాండ్ సమీపంలో ఫ్లైయాష్ బ్రిక్స్ తయారు చేసి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆ ఇటుకలను తక్కువ ఖర్చుతో సరఫరా చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో శనివారం మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు యాష్‌పాండ్ సమీపంలో ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీని ప్రయోగాత్మకంగా చేపట్టారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా.. వారిని భాగస్వామ్యం చేసేలా రూపొందించిన నేపథ్యంలో అధికారులు ఆ మహిళలకు స్వయంగా ఇటుకలను తయారు చేసే విధానాన్ని చూపారు. యాష్ పాండ్ లో పెద్ద ఎత్తున యాష్ నిల్వలు ఉండటం, సమీపంలోనే సిమెంట్, ఎర్ర మట్టితో చేసిన ఇటుకలు, ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీతో డ్వాక్రా మహిళలతో తయారు చేయించి వారికి ఉపాధి కల్పిస్తూనే ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేసే చర్యలను తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇది పూర్తి స్థాయిలో అమలు అయితే చుట్టపక్క గ్రామాల మహిళలకు ఉపాధి దొరుకుతుందని, ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా ఎంతోకొంత ప్రయోజనం ఉంటుందన్నారు. ఇక్కడ ఈ విధానం విజయవంతమైతే చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న సంఘాలకు కూడా ఈ బ్రిక్స్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే ఆలోచనల్లో అధికారులున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రాంబాబు. మడి గౌతమి, మడి స్వరూప, లీల, తదితర సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సమగ్ర.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్కరు ఇన్‌చార్జీలుగా ఉంటారు. ఇక జిల్లాస్థాయిలో ఒక్క డీఈవో తప్పా.. మిగతా వారందరూ అవుట్ సోర్సింగ్‌తో పాటు ఇన్‌చార్జీలే..! జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీపీవోగా జిల్లా విద్యాశాఖాధికారి, ఫైనాన్స్ ఎకౌంట్స్ ఆఫీసర్‌గా ఇన్‌చార్జీ హెచ్ఎంలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వారి కింద సిస్టమ్ ఎనాలసిస్ ఉద్యోగులు పని చేస్తారు. ప్రధానమైన విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వల్ల జవాబుదారీతనం తగ్గిపోతోంది.

నిధుల లావాదేవీలన్నీ ఇక్కడి నుంచే..

సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద ప్రతీ ఏడాది కోట్లాది రూపాయల నిధులు పాఠశాలలకు విడుదల అవుతున్నాయి. మార్చి నెలలో బడ్జెట్ పంపిస్తే, జూన్ నెలలో బడ్జెట్ పద్దుల వారీగా కేటాయిస్తారు. సగం నిధులు ఆగస్టు నెలలో విడుదల చేస్తున్నారు. ఈ నిధులు పీపీఏ అకౌంట్స్ ద్వారా బ్యాంకుల్లో జమ అవుతాయి. పాఠశాలల్లో ఖర్చు చేసిన నిధులు ఏ వ్యక్తి వద్ద కానీ.. ఏ దుకాణం, ఏ సంస్థ ద్వారా గానీ ఖర్చు చేస్తే వారి పేరుపై చెక్ ఇవ్వాల్సి ఉంటుంది. రెండో దశ నిధులు మార్చి నెలలో విడుదల చేసి అప్పుడే యూసీలు ఇవ్వమని ఒత్తిడి తీసుకురావడం, మూడో వ్యక్తికి చెక్‌లు ఇవ్వడం తలనొప్పిగా మారిందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో బిల్లులు పాస్ కావడం విచిత్రంగా ఉంటుంది. కిందిస్థాయి నుంచి వచ్చిన బిల్లులకు ఆడిట్ చేసి.. ఆ తర్వాత ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్ వద్దకు వెళ్లాలి. అక్కడి నుంచి డీఈవో వద్దకు, ఆ తర్వాత కలెక్టర్ వద్దకు ఫైనల్ అనుమతి కోసం వెళ్తుంది. కానీ ఈ జిల్లాలో నేరుగా బిల్లులు రూపొందించి డీఈవో సంతకం చేయించి ఎఫ్ఎఓలో, ఆ తర్వాత కలెక్టర్‌కు పంపుతున్నారు.

గతకొన్ని సంవత్సరాలుగా కేజీబీవీ పాఠశాలల్లో టెండర్లు జరగడం లేదు. పైస్థాయిలో అధికారులు నిర్ణయించిన రేట్లకే ఎక్కడైనా కొనుగోలు చేయవచ్చు. ఎవరికి వారే బిల్లులను రెడ్ ఇంకుతో ఆడిట్ చేసుకుని బిల్లులు తీసుకువస్తారు. ఎఫ్ఎఓ ఆడిట్ చేసే అవకాశానికి కూడా వీలు లేకుండా పోతోంది. ఆడిట్ చేసి వెనక్కి పంపిన బిల్లులు లేకపోవడం గమనార్హం.

పాత గోడ కూలి సుతారీ కూలీ మృతి

ముదిగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు పాత గోడ కూలి సుతారీ కూలీ మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన లక్ష్మయ్య అలియాస్ భీముడు(65) సుతారీ పనిలో భాగంగా ఓ ఇంటి నిర్మాణం చేస్తుండగా పక్కనే ఉన్న పాత గోడ కూలి లక్ష్మయ్యపై పడింది. గమనించిన తోటి కూలీలు అతడిని ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భీముడి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. భీముడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

స్థానికానికి కసరత్తు!

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించింది. అదే తరహాలో ఎన్నికలు జరిగే అవకాశం లేకపోలేదు. అయితే రాజకీయపార్టీలు, అధికారయంత్రాంగం మాత్రం ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలపైనే దృష్టిసారించి కసరత్తు చేస్తున్నాయి. జిల్లా స్థాయిలో జిల్లా యంత్రాంగం, ప్రధాన రాజకీయపార్టీలతో ఎన్నికల నియమావళిపైన సమావేశం నిర్వహించింది. మండల స్థాయిలో కూడా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఓటర్ల జాబితాపై నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటికే ముసాయిదా జాబితాలను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించారు. జిల్లాలో మొత్తం 8,02,690 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 3,88,244, మహిళలు 4,14,224మంది ఉన్నారు.

పింఛన్లపై తేల్చుకుంటాం..

(5వ పేజీ తరువాయి)

జరిగిన ఈ సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ చాలా నేర్చుకోవాలని, బాబు వద్ద శిష్యరికం చేసినా వారిద్దరు ఏమీ నేర్చుకున్నట్టు లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నారని, అధికారంలోకి రాగానే పింఛన్లను పెంచి ఇస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఏ హామీని కూడా సక్రమంగా అమలు చేయలేని పరిస్థితులున్నాయన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఎండగట్టలేక పోతున్నాడన్నారు. వికలాంగులకు రూ.6వేలు, పెన్షన్లు రూ.4వేలు ఇచ్చి తీరాల్సిందేనన్నారు. 9న జరుగనున్న మహాగర్జనను విజయవంతం చేయాలని మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామినేని భవాని చౌదరి, మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, చెరుకుమిల్లి శ్రీను, అజ్మీరా భారతి, షేక్.సైదాబిబొజ్జ జీవరత్నం, తోళ్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుపై నిర్లక్ష్యం తగదు


బోనకల్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ

బోనకల్ (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల, వితంతువుల ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి వారి పింఛన్ల పెంపుపై నిర్లక్ష్యం చేస్తున్నాడని, అది ఆయనకు తగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. బోనకల్‌లోని ఓ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం వికలాంగుల మహాగర్జన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్న పింఛన్ల పెంపు గురించి సీఎంతో పాటు ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా ప్రశ్నించకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యాడన్నారు. పింఛన్ల పెంపు కోరుతూ వచ్చే నెల 9వ తేదీన మహాగర్జన కార్యక్రమాన్ని చేపడుతున్నందున జయప్రదం చేయాలని కోరారు.

మా భూములకు దిక్కెవరు?


జమలాపురంలో పర్యాటక అభివృద్ధికి కేటాయించిన అటవీ భూమి


అటవీ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భట్టి (ఫైల్)

సాగు భూముల్లో అటవీ అధికారుల ట్రెంచ్
భూముల పంచాయితీ తేలకుండానే అభివృద్ధి పనులు
అభివృద్ధి పేరుతో ఇచ్చిన భూములు లాక్కుంటారా?
ప్రత్యామ్నాయం చూపాలని రైతుల ఆవేదన

ఎర్రుపాలెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : యాంత్రిక జీవనంలో సాగిపోయే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడంతో పాటు రాష్ట్రంలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ పార్కులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పర్యాటక ముఖ చిత్రంలో ఎర్రుపాలెం మండలాన్ని ఉంచాలనే పట్టుదలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండలంలోని జమలాపురం గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి దగ్గరలో గల అటవీ భూముల్లో అర్బన్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జమలాపురంలో రమణీయమైన అటవీ ప్రకృతి అందాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పర్యాటకులకు కనువిందు చేసేలా ఆహ్లాదం, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ఏకో టూరిజం ద్వారా అర్బన్ పార్క్‌ను ఏర్పాటుచేయాలని అటవీశాఖను ఆదేశించారు. సుమారు రూ.5కోట్లతో నిర్మించనున్న ఈ అర్బన్ పార్క్‌లో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం కాటేజీలు, క్యాంటీన్లు, ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేయనున్నారు. గత జనవరి 7న భట్టి భూమి పూజచేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. దీనికోసం ఇప్పటికే ప్రాథమికంగా పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం రూ.80లక్షలను మంజూరు కూడా చేసింది. కాగా.. అటవీ భూములకు ఆనుకొని సర్వేనెంబరు 9కి సంబంధించి రెవెన్యూశాఖ పరిధిలో ప్రభుత్వ పట్టా భూములున్నాయి. సుమారు 45 ఏళ్లక్రితం సర్వే నెంబరు 9లోగల ప్రభుత్వ భూమిలో పోడు చేసిసాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించి 13 మందికి 1977 తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం అసైన్డ్ పట్టాలనూ అందించింది. ఇందులో 15 ఏళ్ల క్రితం వరకు పట్టాలున్న రైతులు వివిధ రకాల పంటలను సాగుచేసుకుంటున్నారు. కానీ పూర్తి అటవీ ప్రాంతంగా ఉండడం, సురక్షితంగా లేకపోవడం, ఈ ప్రాంతంలో కాపుసారా బట్టీలు ఎక్కువగా ఉంటున్నాయని.. దీనివల్ల అకారణంగా సారా కేసుల విచారణకు హాజరుకావాల్సి వస్తుందన్న అభద్రతాభావంతో ఆయా భూముల్లో కొందరు రైతులుసాగుకు దూరంగా ఉన్నారు. ఆభూములకు ఆనుకుని సర్వేనెంబరు 9/21లో ఎకరన్నర భూమిని ప్రభుత్వం స్మశానవాటికకు కేటాయించింది. ఇష్టం లేక రైతులు సాగును విరమించుకున్నారు. భూమి కోల్పోతున్న 13మంది రైతులకు ప్రత్యామ్నాయంగా బండిచరామి భూముల్లో భూములు కేటాయించాలని వారు కోరుతున్నారు.

భూముల పంచాయితీ తేలకుండానే..

జమలాపురంలో పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదించిన సర్వేనెంబరు 9లో రెవెన్యూ భూములున్నాయి. ఆ భూములు మావేనని అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారుల మధ్య గతంలో వాదనలు జరిగాయి. 2019లో ఇరుశాఖల ఉన్నతాధికారుల సమక్షంలో ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు సర్వే నివేదిక రాకపోవడంతో భూముల పంచాయితీ అలాగే ఉంది. జమలాపురంలో పర్యాటక అభివృద్ధికి గుర్తించినవన్నీ అటవీ భూములేనని గతంలో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థవిక్రంసింగ్ ప్రకటించడంతో.. మళ్లీ భూముల పంచాయితీ తెరపైకి వచ్చింది. పెద్ద గోపవరం రెవెన్యూలో సర్వేనెం 547పాటు వరుసగా 221,222,223,224,228, 229,230, 231 సర్వేనెంబర్లలో అటవీ భూములున్నాయి. జమలాపురం ,పెద్దగోపవరం, తాటిగూడెం, రెవెన్యూ గ్రామాలలో అప్పట్లో ట్రైజంక్షన్ సర్వే నిర్వహించారని, ఒకవేళ అటవీభూములు అయితే హద్దులు ఎందుకు నిర్ణయించలేదని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. 1964నుంచి జమలాపురంలో సర్వేనెంబరు 9 రెవెన్యూశాఖ పరిధిలోనే ఉందని, గ్రామంలో సింహభాగం అదేనని తహసీల్దార్ మన్నె ఉషా శారద అంటున్నారు. కాగా.. ఈ భూమి పంచాయితీలు ఏవీ లేకుండా పర్యాటకులకు పార్కింగ్ స్థలం కోసమే మాత్రమే సర్వేనెంబర్ 9ని ఉపయోగించుకోవాలని, అటవీ భూములలోనే పర్యాటక అభివృద్ధి చేయాలని అప్పట్లో అటవీ అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి సూచించారని.. అయినా అటవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీ అధికారులు దౌర్జన్యంగా ట్రెంచ్ కొట్టారు..

● భూక్యా బాలాజీ, గిరిజన రైతు


బాధిత రైతు భూక్యా బాలాజీ

గత 40 ఏళ్ల క్రితమే జమలాపురం గ్రామ రెవెన్యూలో గల సర్వే నెంబర్ 9/14లో 20గుంటల అసైన్డ్ భూమిని ప్రభుత్వం నాకు ఇచ్చింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటూ బతుకుతున్నా. నాతో పాటు అసైన్డ్ పట్టాలు వచ్చిన రైతులు సగంలోనే సాగు చేయకుండా భూమిని వదిలి వెళ్లిపోయారు. నేను ఈ భూమినే నమ్ముకుని సాగు చేసుకుంటున్నా.. అప్పు తెచ్చి ఇందులో షెడ్డు ఏర్పాటు చేసి నాటుకోళ్లను పెంచుకుంటున్నా.. అటవీ అధికారులు పర్యాటక అభివృద్ధి పేరుతో నా భూమిని లాక్కోవాలని ఎప్పటి నుంచో చూస్తున్నారు. గత రెండు నెలలుగా నోటీసులతో బెదిరిస్తున్నారు. ఇది అటవీశాఖ భూమి అని, తక్షణమే ఖాళీ చేయాలని చెబుతున్నారు. ఇన్నేళ్లుగా అన్నం పెట్టిన భూమి లేకుండా పోతుందని రెండు నెలల నుంచి నేను, నా కుటుంబం మానసికంగా చిత్రవధని అనుభవిస్తున్నాం. శనివారం హఠాత్తుగా జేసీబీని తీసుకొచ్చి నా సాగుభూమిలో దౌర్జన్యంగా ట్రెంచి కొట్టారు. ఇదే నా బతుకుదెరువు. ఇప్పటికిప్పుడు ప్రత్యామ్నాయం చూపకుండా భూమిని ఖాళీ చేయమంటే నా కుటుంబం రోడ్డున పడ్డట్లే. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా..

శివ లింగాకారంలో గణపతికి లడ్డూ ప్రసాదం


అశ్వారావుపేటలో శివ లింగాకారంలో తయారు చేసిన లడ్డూ

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పట్టణంలోని దండాబత్తుల వారి వీధిలో డీఎస్‌కే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద ఉన్న శివలింగాకార లడ్డూ ప్రసాదం అందరినీ ఆకట్టుకుంటుంది. పట్టణానికి చెందిన సత్యదుర్గ స్వీట్ షాప్ యజమానులు 40కిలోలతో ప్రత్యేకంగా శివుని లింగాకారంలో లడ్డూ ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారుచేసి నిర్వాహకులకు అందించారు. గణపతిని దర్శించుకున్న భక్తులంతా శివలింగాన్ని ఇక్కడ ఉంచారేమిటి అనుకుంటూ వెళ్లి.. అక్కడ ఉన్నది ప్రసాదం అని తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు.


అటవీ శాఖ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

మొక్కల పెంపకానికి ప్రత్యేక ప్రణాళిక

● డీఎఫ్‌వో కిష్టాగౌడ్

జూలూరుపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది అటవీ ప్రాంతాలలో ప్లాంటేషన్‌లను ఏర్పాటు చేసేందుకు జిల్లాలోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు డీఎఫ్‌వో కిష్టాగౌడ్ తెలిపారు. శనివారం జూలూరుపాడులోని అటవీశాఖ నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో పెంచిన మొక్కలను, వచ్చే ఏడాదికి సంబంధించి అటవీజాతి మొక్కల పెంపకానికి సంబంధించి సిబ్బంది తయారు చేసిన ప్రైమరీబెడ్లలో నాటిన విత్తనాలను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో ఈ ఏడాది ఎన్ని మొక్కలను పెంచారని, ఇప్పటివరకు ఎన్ని మొక్కలను పంపిణీ చేశారని ఆరా తీశారు. 1.07 లక్షల మొక్కలను జూలూరుపాడు నర్సరీలో పెంచడం జరిగిందని, వాటిలో 74వేల మొక్కలను పంపిణీ చేసినట్లు ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు తెలిపారు. అనంతరం కిష్టాగౌడ్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి ఎన్ని మొక్కలు అవసరపడతాయో గుర్తించి నివేదికను అందించాలన్నారు. నర్సరీలను శుభ్రం చేసి మొక్కలు పెంచేందుకు సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు, ఎఫ్ఎస్ఓ ఎం.హనుమంతు, ఎఫ్‌బివో నరసింహారావు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళాకు హాజరైన పీవో

దుమ్ముగూడెం ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కె.రేగుబల్లి-1 ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎనిమిది మండలాల స్థాయి టీఎల్ఎం మేళాకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను వినియోగించి పాఠ్యాంశాలపై మరింత మెరుగైన అవగాహనను పెంపొందించుకోవాలని సిబ్బందికి పీవో రాహుల్ సూచించారు. దృశ్య సహాయాలు, నమూనాలు, ఆచరణాత్మక కార్యకలాపాల ద్వారా సంక్లిష్ట ఆలోచనలను సరళీకృతం చేయడానికి సహాయపడుతుందన్నారు. ఈ సమావేశంలో డీడీ మణెమ్మ, ఏపీవో డేవిడ్, ఏటీడీవో అశోక్‌తో పాటు ఎనిమిది మండలాల పరిధిలోని ఏడు కాంప్లెక్సుల నుంచి 84 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనువిందుగా 'నంబి'

ఊసూరు పరిధిలో సోయగాలు పంచుతున్న సుందర జలపాతం
రోజుకు వెయ్యి మందికి పైగా సందర్శకుల రాక


నంబి జలపాత సుందర దృశ్యం

చర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నంబి అనే గ్రామం. ఊరు శివారులోని కర్రె గుట్టల వద్ద ఓ జలపాతం కనువిందు చేస్తోంది. భారీ వర్షాలు కురుస్తుండడంతో.. వెయ్యి అడుగుల పైనుంచి నీరు జాలువారుతోంది. ఈ జలపాతానికి అక్కడి గిరిజనులు నంబి జలపాతంగా పేరు పెట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే అతి పెద్ద జలపాతమని అధికారులు చెబుతున్నారు. ఈ జలపాతంతో పాటు పచ్చటి అడవులను చూసేందుకు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఒడిస్సా, ఢిల్లీ, ఇతర ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు వస్తున్నారు. ఈ క్రమంలో రోజూ వెయ్యి మందికి పైగా జనాభా వస్తున్నారని అక్కడివారు చెబుతున్నారు. పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని అక్కడి అధికారులు కొన్ని ఏర్పాట్లు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో.. ఇప్పుడిప్పుడే అధికారులు రహదారులను నిర్మిస్తున్నారు.


జలపాతం వద్ద పర్యాటకుల సందడి

జలపాతానికి వెళ్లాలంటే..

జలపాతం వద్దకు వెళ్లాలనుకుంటే.. నంబి గ్రామం నుంచి సుమారు 4 నాలుగు కిలోమీటర్ల మేర నడవాల్సి ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప నుంచి సుమారు 37కిలోమీటర్లు వెళ్తే ఈ జలపాతం వస్తుంది. ప్రస్తుతం రోడ్ సౌకర్యం లేకపోవడంతో ఇతర మార్గంలో 200 కిలోమీటర్లు ప్రయాణించి జలపాతాన్ని చూసేందుకు జనం వెళ్తున్నారు.

బాలుర గురుకులాల్లో ఏసీబీ తనిఖీలు


సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

కొణిజర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలో అమ్మపాలెం పంచాయతీలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల్లో శనివారం ఏసీబీ, పలుశాఖల అధికారులు తనిఖీలు చేశారు. ఖమ్మంఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో ఆహారనాణ్యత, తూనికలు కొలతలు, పారిశుధ్యం, లీగల్ మెట్రాలజీ, ఆడిట్‌శాఖల అధికారులు ఉదయమే పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల, కళాశాలలో పారిశుధ్యం, వంటసామగ్రి, వస్తువులు, స్టాక్, రికార్డులను పరిశీలించారు. సౌకర్యాలు, భోజనం, సిబ్బంది తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దాంతో విద్యార్థులు తమకు కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడంలేదని, ఇంటర్ పదితరగతుల విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం లేదని, ఇంటర్ విద్యార్థులకు భోజనం సరిపోవడంలేదని విద్యార్థులు తెలపడంతో రికార్డు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. మైనారిటీ గురుకులాన్ని ఉదయం ఆరుగంటలకే వచ్చి తనిఖీ చేశామన్నారు. విద్యార్థులు తెలిపిన సమస్యలను, తమ పరిశీలించిన విషయాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. విధుల పట్ల అలసత్వం వహించే వారిపై నివేదక ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబు, లీగల్ మెట్రాలజీ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, ఆడిట్ ఆఫీసర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

వెంగన్నపాలెం, పాపకొల్లు నర్సరీలను సందర్శించిన ఏపీడీ


వెంగన్నపాలెం నర్సరీలో రికార్డులను పరిశీలిస్తున్న రవి

జూలూరుపాడు,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బాణోత్ దుర్గాప్రసాద్ ఇటీవల భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ అడిషనల్‌పీడీ ఎన్.రవి శనివారం జూలూరుపాడు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. విచారణ నిర్వహించారు. వెంగన్నపాలెం, పాపకొల్లు నర్సరీలను సందర్శించి పెంచిన మొక్కల వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు.రికార్డులను పరిశీలించారు. మండల ఏపీఓ రవి నిబంధనలకు విరుద్ధంగా మెటీరియల్ పేమెంట్లను చేశారని, గ్రామపంచాయతీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తన సొంతవారి పేరిట పేమెంట్లను చేశారని ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై అడిషనల్ పీడీ విచారణ చేపట్టారు. ఏపీఓ, సిబ్బంది నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించటం జరిగిందని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఫిర్యాదుదారుడు దుర్గాప్రసాద్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

» నీట మునిగి కాంట్రాక్ట్ వంట మనిషి మృతి
» పాఠశాల ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
» ప్రిన్సిపాల్ సహా సిబ్బంది పరారీ


గురుకుల పాఠశాల ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

గుండాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):వినాయక నిమజ్జనంలో అపశ్రుతి దొర్లింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడి ప్రతిమకు మూడురోజుల అనంతరం శనివారం నిమజ్జనాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులంతా కలసి ఊరేగింపుగా స్థానిక మల్లన్న వాగు వద్దకు తీసుకెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులంతా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. ఈక్రమంలోనే గురుకుల కళాశాలలో కాంట్రాక్ట్ వంట మనిషిగా పనిచేస్తున్న బానోత్ మోహన్(35) మరో ఉపాధ్యాయుడితో కలిసి స్నానం చేసేందుకు మళ్లీ వాగు చెక్ డ్యాం వద్దకు చేరుకున్నారు. ఇటీవలి వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ తీవ్రతకు మోహన్ నీటిలో గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న ఉపాధ్యాయుడు పాఠశాల సిబ్బందికి సమాచారం అందించగా.. సిబ్బంది అక్కడికి చేరుకొని వాగులో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈలోపు సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు వాగువద్దకు చేరుకోగా.. వారు తమను ఏమైనా చేస్తారన్న భయంతో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం కుటుంబసభ్యులు మోహన్ మృతదేహాన్ని గురుకుల పాఠశాల వైపు తీసుకువెళ్తుండగా పోలీసులు అడ్డగించారు. అయినా వినకుండా పాఠశాల వద్ద తరలించి తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. నిమజ్జనం చేసేందుకు సమీపంలో చెరువులో ఉండగా.. వాగుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని, మోహన్ మృతిపై తమకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై గుండాల ఎస్ఐ సైదా రాహూఫ్ కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న టపాసుల స్వాధీనం

ఖమ్మంక్రైం, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న టపాసులను ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం నగరంలోని డెకరేషన్ ఈవెంట్ నిర్వహించే బాలకృష్ణ అనే వ్యక్తి రూ.3.25 లక్షల విలువచేసే టపాసులను డోర్నకల్‌కు తరలిస్తుండగా.. పోలీసులు తనిఖీచేసి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. బాలకృష్ణతో పాటు డోర్నకల్‌కు చెందిన ఆటో డ్రైవర్ వీరభద్రంపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కారేపల్లి ఆగస్టు30(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఎస్‌కే గోరుపాష(26) ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి కారేపల్లి క్రాస్‌రోడ్డులోని ఇంట్లో పడుకున్నాడు. ఉదయం చాలాసమయం వరకు లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపుకొట్టి లేపేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోనే ఉరివేసుకున్న తాడుతెగి కిందపడి మృతిచెందాడు. గతంలో లారీ క్లీనర్‌గా పనిచేసిన పాష, ఇటీవల డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య అనూష, 15నెలల బాబు ఉన్నాడు.

అండగా అన్నం

» మతిస్థిమితం లేని యువతికి అన్నం సేవా ఫౌండేషన్‌లో ఆశ్రయం.. వైద్య సేవలు
» మగబిడ్డకు జన్మనిచ్చిన యువతి


బిడ్డతో మహాలక్ష్మి


అన్నం ఫౌండేషన్‌లో సీమంతం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మంఖానాపురం హవేలి/ దుమ్ముగూడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ నిండు గర్భిణికి నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయం కల్పించి వైద్య సేవలందించగా, శనివారం మగ బిడ్డకు జన్మనిచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ఒక గ్రామంలో మతిస్థిమితం లేని ఆదివాసి యువతి గర్భం దాల్చింది. ఈ యువతికి తల్లి తోబుట్టువులు లేరు. తండ్రి ఒక్కడే ఉన్నాడు. ఇరుగుపొరుగు వారు కూడా పట్టించుకునే వారూ లేరు. ఇల్లు కూడా పూరిగుడిసె, కరెంటు కూడా లేదు. అటువంటి స్థితిలో ఈ యువతి నరక యాతన పడుతుండగా..ఆమెకు ఆశ్రయం కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సదరు డిడబ్ల్యూ ప్రయత్నించగా ఎవరు చేర్చుకోబోమని చెప్పారు. అప్పుడు ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్‌కి కొత్తగూడెం డీడబ్ల్యూ సమాచారం అందించారు. ఈనెల 1న ఖమ్మం నుంచి అన్నం ఫౌండేషన్ అంబులెన్స్‌లో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామానికి వెళ్లి అధికారుల సమక్షంలో మహాలక్ష్మితో పాటు తండ్రి బాలరాజును ఖమ్మం తీసుకొచ్చారు. అప్పటి నుంచి మహాలక్ష్మిని ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో వసతి కల్పించారు. ఇటీవల ఈ యువతికి అన్నం ఫౌండేషన్‌లో సీమంతం కూడా నిర్వహించారు. ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం అందిస్తున్నారు. శనివారం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చేర్చగా సాధారణ కాన్పుతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బాబు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తెలిపారు.

తప్పుల తడకగా జాస్తిపల్లి ఓటరు జాబితా

పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు

కామేపల్లి,ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాస్తిపల్లి ఓటర్ జాబితా తప్పులు తడకగా ఉందని బీఆర్ఎస్ నాయకులు పంచాయతీ కార్యదర్శి దేవికి ఫిర్యాదు చేశారు. ఓటర్‌లిస్ట్‌లో ఒకరి పేరు మీదు రెండు ఓట్లు ఉన్నాయని, గ్రామంలో సుమారు 100మంది చనిపోయిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయని, భర్త ఓటు ఒక వార్డులో భార్య ఓటు మరో వార్డులో ఉన్నాయని వివరించారు. వెంటనే విచారణ చేపట్ట తుదిజాబితా విడుదల చేయాలని కోరారు. మల్లెంపాటి శ్రీనివాసరావు,యర్రబోయిన బసవయ్య, దేవండ్ల క్రిష్ణయ్య, బత్తులవెంకన్న,దేవండ్ల రాంబాబు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

కానిస్టేబుల్ రాజుకు సీపీ అభినందన



రాజును అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పిల్లిరాజును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని చైనా, టిబెట్ సరిహద్దులో ఉన్న సుందో వద్ద జరిగిన స్పీటీ మారథాన్‌లో ఆయన పతకం సాధించారు. ఈనెల 24న జరిగిన ఫుల్‌మారథాన్ 42కి.మీ పోటీలో పతకం సాధించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని సీపీ సునీల్‌దత్ ఆకాంక్షించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సీపీ సునీల్‌దత్ శనివారం శాలువాలతో సన్మానించారు. ఇకపై కుటుంబసభ్యులతో ఆనందంగా వారి జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో ఏసీపీలు మహేష్, సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు, సురేష్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

యువకుడికి డాక్టరేట్ ప్రదానం



కూసుమంచి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన తాళ్లూరి మహితేజకు కేరళ రాష్ట్రంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలికట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పవర్ ఎలక్ట్రానిక్స్ ఇవిస్ అనే అంశంపై సమర్పించిన రిసెర్చ్‌కుగాను యూనివర్సిటీ ఈడాక్టరేట్ ప్రదానం చేసింది. నిట్‌యూనివర్సిటీలో కాన్వకేషన్‌లో మహితేజ డాక్టరేట్‌ను అందుకున్నారు.

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరపాలి

- 2వేల విగ్రహాల నిమ్మజ్జనానికి ఏర్పాట్లు
- అధికారులతో కేఎంసీ కమిషనర్ అగస్త్య సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మంకార్పొరేషన్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం మున్నేరు పరివాహకంలో జరిగే గణేష్ నిమ్మజ్జనం ప్రశాంతంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. శనివారం కేఎంసీ కార్యాలయంలో ఈఈ కృష్ణలాల్, డీఈలు దరణి, శ్రీనివాసరావు, ఏఈలతో కమిషనర్ రివ్యూ నిర్వహించారు. వినాయక చవితి నవ రాత్రి ఉత్సవాలు అనంతరం చేపట్టే గణేష్ నిమజ్జన ఏర్పాట్లుపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రకాష్‌నగర్ ఘాట్‌కు అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కు బాధ్యతలు అప్పగించారు. పర్యవేక్షకుడిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను నియమించారు. కాల్వొడ్డు ఘాట్‌కు ఇన్‌చార్జీగా ఈఈ కృష్ణలాల్, పర్యవేక్షకుడిగా ఎస్ఈ రంజిత్‌ను కేటాయించారు. పోలీసు శాఖ లెక్కల మేరకు 2వేల విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని, వాటిలో ప్రకాశ్‌నగర్‌కు 500 విగ్రహాలు, కాల్వొడ్డుకు 1500 విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలోని వార్డు వారీగా పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. పనులు జాప్యానికి కారణాలను తెలుసుకున్నారు. నాణ్యతలో ఎటువంటి రాజీ పడోద్దని, నిర్ణీత సమయానికి పనులు పూర్తి కావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అంగరంగ వైభవంగా కల్యాణం

ఖమ్మంఖానాపురం హవేలి: రాపర్తినగర్‌లో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో శనివారం రాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు ఒడి బియ్యాన్ని పోసి కట్న కానుకలు సమర్పించారు. 48వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో అన్నదానం నిర్వహించారు. తుమ్మల యుగంధర్ అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తోట రామారావు తదితరులు పాల్గొన్నారు. గాంధీచౌక్‌లోని పలు గణేష్ మండపాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాగ్రెస్ నాయకుడు యర్రం బాలగంగాధర్ తిలక్, త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

6న గణేష్ సామూహిక నిమజ్జనోత్సవం

6న శనివారం గణనాథుడి సామూహిక నిమజ్జనం ఉంటుందని సంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి సూచించారు. శనివారం నగరంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి సూచనలు చేశారు.

తాళ్లగూడెంలో అన్నదానం

కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం కొత్తకాలనీలో గణేష మండపం వద్ద అన్నదానం చేపట్టారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్లమోతు లక్ష్మయ్య, దుగ్గి క్రిష్ణ, ముత్యంరామక్రిష్ణక్రిష్ణసురేష్ పాల్గొన్నారు.



రాపర్తినగర్‌లో వరసిద్ధి వినాయకుడి కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు



వెంకటేశ్వరనగర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తుమ్మల యుగంధర్



నేలకొండపల్లి రామమందిరంలో..



తాళ్లగూడెంలో అన్నదానం..



'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో పూజలు చేస్తున్న దంపతులు



జయనగర్‌లో అన్నదానం

అపార్ నెంబర్‌ను అప్‌లోడ్ చేయాలి

ఇన్‌చార్జ్ డీఈవో, అదనపు కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): అన్నిప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థులకు అపార్ నెంబరును యూడైస్ ఫోల్డర్‌లో అపలోడ్ చేయాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి పి.శ్రీజ అన్నారు. శనివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 6లోగా అన్నిప్రైవేటు విద్యా సంస్థలు అపార్ నెంబరును విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అపార్ ఐడీ కార్డు విద్యా, వ్యక్తిగత డేటాను కలిగి ఉంటుందన్నారు. ఈ ఐడీ అనేది ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య, ఇదిఆధార్ కార్డు మాదిరి ఓసారి మాత్రమే పొందవచురచని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని 270 ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

'న్యూవిజన్'లో ఎన్నికల సందడి



ఓటు వేసేందుకు క్యూలో విద్యార్థులు

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో శనివారం విద్యార్థుల ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం డి.అబాద్‌అలీ తెలిపారు. ఓటు ప్రాధాన్యం, ప్రచార నిర్వహణ, నామినేషన్లు దాఖలు చేయడంవంటి పూర్తి ఎన్నికల ప్రక్రియను సంపూర్ణ అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ తెలిపారు. నిజమైన ఎన్నికలను తలపించేలా పోటా పోటీగా ప్రచారం నిర్వహించడం ఎన్నికల జరగటం విద్యార్థులను ఎంతగానో ఉత్సాహపరిచింది.

ఎన్‌సీసీ యూనిఫాంతో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

కమాండెంట్‌కు బీజేపీ జిల్లా నాయకుల ఫిర్యాదు



ఎన్‌సీసీ కమాండెంట్‌కు ఫిర్యాదును అందిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న నగరంలో విపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనా సంఘీభావ ర్యాలీపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యూనిఫాంతో పాల్గొనడంపై బీజేపీ ఖమ్మం జిల్లా నాయకులు శనివారం 11 ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌కే.భద్రకు ఫిర్యాదు చేశారు. చట్ట విరుద్ధమైన ర్యాలీలో తల్లిదండ్రుల, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలా పాల్గొంటారని ఫిర్యాదులో ప్రశ్నించారు. రెచ్చగొట్టేలా నిర్వహించిన ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులను తీసుకెళ్లిన ఘటనపై విచారణ చేసి, యూనిఫాంని దుర్వినియోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీసీ పవిత్రతను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, ఈదుల వీరభద్రం, నకిరకంటి వీరభద్రం, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

తక్షణం ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించాలి

సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): వైద్యంపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య శ్రీ బిల్లులకు నిధులు మంజూరు చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, దండి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు విడివిడిగా ప్రకటనలు విడుదల చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ప్రైవేటు హాస్పటల్స్‌కు బిల్లులు ఇవ్వకపోవటంతో నిరుపేదలకు వైద్యసేవలు అందించటంలో జాప్యంజరుగుతుందన్నారు. పేదలు ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితిలో ఆరోగ్యశ్రీనే ఆధారంగా చూస్తున్నారని తెలిపారు. ప్రజాఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఫ్యాక్స్ కేంద్రాల ద్వారా నేరుగా యూరియా

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ప్యాక్స్ కేంద్రాలు, ఉపకేంద్రాల ద్వారా నేరుగా రైతులకు యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్యాక్స్‌ద్వారా యూరియాపంపిణీ పైలెట్ ప్రాజెక్టుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న వ్యధను ఈనెల 25న యూరియా కొరత-రైతుల వ్యధ అంటూ ఆంధ్రజ్యోతి కధనం వచ్చింది. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్యాక్స్‌కేంద్రాల ద్వారా మాత్రమే యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ప్రవేటు డీలర్లకు కేటాయింపులు ఉండవని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్యాక్స్ కేంద్రాలు, ఉపకేంద్రాలు ద్వారా యూరియా పంపిణీ ప్రారంభించాలని ఏవోలను ఆదేశించారు.

ఎంవీపాలెంలో శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ఖమ్మంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంవీపాలెంలో స్మశాన వాటిక ఏర్పాటుకు అధికారులు స్థలపరిశీలన చేశారు. సర్వే నంబర్ 396లో స్థలం కేటాయించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పాపిట్ల సత్యనారాయణ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ధర్నాలు నిర్వహించారు. శనివారం ఆర్ఐ క్రాంతి, సర్వేయర్ సతీష్‌రెడ్డి పరిశీలన జరిపారు.ఈనివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారని తెలిపారు. స్థలపరిశీలనలో సంఘ నాయకులు ఏపూరి వరకుమార్, మల్లయ్య, శ్రీను, మాధవరావు, నాగయ్య, రవి, గోపయ్యముత్తయ్య, మధు, కృష్ణ పాల్గొన్నారు.

ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి

- ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ నమోదులో అధికారుల నిర్లక్ష్యం
- కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదాలతో ఇబ్బందులు
- కామేపల్లి మండలం రేపల్లెవాడలో సంఘటన



రేపల్లెవాడలో ఇందిరమ్మ ఇల్లు

కామేపల్లి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు ఒకరు కట్టుకుంటే.. బిల్లు మరొకరి బ్యాంకు ఖాతాలో జమ చేసిన సంఘటన కామేపల్లి మండలం జగన్నాథతండ గ్రామ పంచాయితీ రేపల్లెవాడ గ్రామంలో చోటు చేసుకుంది. రేపల్లెవాడ గ్రామానికి చెందిన తేజావత్ రవికి ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా పట్టాను పంపిణీ చేశారు. అయితే అధికారులు తప్పిదం వలన తేజావత్ రవి నిర్మాణం ప్రారంభించి బేస్‌మట్టం లెవెల్ మొదటి విడత పనులను పూర్తి చేశారు. హౌసింగ్ ఏఈ వచ్చి ఫొటో తీసుకొని బిల్లు జనరేట్ చేశారు. కానీ అతడి అకౌంట్‌లో నగదు పడలేదు. అదే గ్రామానికి చెందిన అదే పేరు గల వ్యక్తి ఖాతాలో ఈ నగదు జమ అయ్యాయి. బిల్లు రాకవపోవటంతో ఆయన అధికారుల చుట్టూ, బ్యాంక్‌ల చుట్టు తిరిగుతున్నాడు. ఈక్రమంలో నగదు వేరే వ్యక్తి ఎకౌంట్‌లో పడ్డాయని నిర్ధారించుకున్నాడు. దీనిపై ఆరా తీయగా కంప్యూటర్ ఆపరేటర్ లబ్ధిదారుడి ఐడీనెంబర్ నమోదు చేయకుండా లబ్ధిదారుడి పేరుతోనిధులు జమ చేయటంతో మరొకరి ఎకౌంట్ పడ్డాయి. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తిని నగదు ఇవ్వమని కోరగా నేను పేదవాడినని, నాకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తేనే నేను ఆ నగదు ఇస్తానని భీష్మించాడు. ఇదే విషయంపై ఎంపీడీఓ రవీందర్‌ను వివరణ కోరగా తప్పిదం జరిగిందని, పూర్తి విచారణ చేపట్టి లబ్ధిదారునికి నగదు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపాడు.

కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదాలతో..

కంప్యూటర్ ఆపరేటర్లు తమ ఇష్ట వచ్చినట్లు నమోదు చేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పత్రాల్లో పేర్లు కూడా తప్పుల తడకగా నమోదు చేశారు.

తుదిదశకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



ఆస్మారూహీకి నగదు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అండర్-15 బాలుర,బాలికల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు తుదిదశకు చేరుకున్నాయి. పోటీలలో భాగంగా శనివారం సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్వార్టర్స్, సెమీ ఫైనల్స్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా వచ్చే నెల 8 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జాతీయస్థాయి యూత్ పారా బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఆస్మారూహికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరుపున రూ.10 వేలు అందచేశారు. పోటీలను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఏసీపీ ఘంటా వెంకట్రావు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్, అసోసియేషన్ బాధ్యులు జట్ల శ్రీను, రవిమారుత్, సిరిపురపు సుదర్శన్, నల్లమోతువెంకటేశ్వరరావు,యుగంధర్, కొంగర శ్రీనివాస్, దుద్దుకూరి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, చావా వెంకటేశ్వరావు సమీక్షించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చిన ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ, ఇతర నిరుపేదల సంక్షేమానికి అత్యధిక ప్రాదాణ్యత ఇస్తుందని, పూరిళ్లలేని నివాసాలే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శనివారం 26వ డివిజన్ సుగ్గాలవారి తోటలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మేయర్ పునుకొల్లు నీరజ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. వార్డు ఆఫీసర్ రాజు, ప్రసాద్, రామయ్య, బుజ్జి, రజిని, సరిత, మదార్, యాకూబ్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

మార్కెటింగ్ డీఎం అలీమ్

నేలకొండపల్లి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా మార్కెట్ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని మార్కెటింగ్ డీఎం అలీమ్ అన్నారు. శనివారం నేలకొండపల్లి మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మార్కెట్‌కు వచ్చిన ప్యాడీ డ్రయ్యర్, క్లీనర్‌లను ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చిన సమయంలో ధాన్యాన్ని శుభ్రం చేసుకోవటానికి, తేమను ఆరబెట్టుకోవటానికి డ్రయ్యర్, క్లీనర్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎంశ్రీలత, చైర్మన్ సీతారాములు, మార్కెట్ కార్యదర్శి పంతులు, డైరెక్టర్లు చిట్టూరి అచ్చయ్య, సూరేపల్లి రవి,ఆరెకట్ల గురునాధం, ధీరావత్ బాలాజీ పాల్గొన్నారు.



ప్యాడీక్లీనర్ పని తీరును వివరిస్తున్న అధికారులు

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియ చేయాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు రాజకీయ పక్షాలను కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాల్లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. సెప్టెంబరు 2న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు చెప్పారు.ఇప్పటికే అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. తుది జాబితా ప్రకటించే లోపు అభ్యంతరాలను తెలపాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు రాజకీయ పక్షాలకు సూచించారు. ఎస్ఐ పెంటరి సంతోష్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. డీజేలకు ఎట్టిపరిస్థితుల్లో అనుమతులివ్వమని తేల్చి చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, ఎంపీఓ శివ, నాయకులు కేవి రెడ్డి, షేక్.హుస్సేన్, బచ్చలకూరి నాగరాజు, మోర మల్లయ్య, మారిశెట్టి వెంకటేశ్వర్లు,పగిడికత్తుల నాగేశ్వరరావు కొర్లకుంట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపుపెన్షన్ విద్రోహక దినం

విజయవంతం చేయాలి: టీఎన్జీవో

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఉదయం నల్ల బ్యాడ్జీలు నల్లద్రస్సులతో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే బస్సు యాత్రలో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 12న ఛల్లో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, జడ్ఎస్ జైపాల్, విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, అసోసియేట్ ప్రసిడెంట్ తదితరులు పాల్గొన్నారు. కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, జిల్లా కార్యవర్గం, యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా విభాగం కార్యవర్గం పాల్గొన్నారు.

సీఐటీయూ నుంచి ఐఎన్‌టీయూసీలో చేరిక

సంఘం మారిన మెప్మా ఆర్పీలు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):నగరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌లు సీఐటీయూ సంఘం నుంచి కాంగ్రెస్ అనుభందంగా ఉన్న ఐఎన్‌టీయూసీలో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ఆర్పీలకు సంఘం కండువాలు కప్పి స్వాగతించారు. ఆర్పీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే సబిహా అంజుం. కార్యదర్శి గందసిరి పద్మ, కోశాధికారి బత్తుల మొగిలమ్మ, ఉపాధ్యక్షురాలు రత్నాకరం, రమాదేవి, గుండెబోయిన లక్ష్మీకుమారితో పాటుగా మొత్తం104మంది ఆర్పీలు ఐఎన్‌టీయూసీలో చేరినట్లు సంఘం అధ్యక్షురాలు ఎస్‌కే సబిహా అంజుం తెలిపారు.





ఆలిండియా నీట్ ర్యాంకర్ ఐశ్వర్యకు సన్మానం



వైరా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన మిట్టపల్లి నాగేశ్వరరావు, అనురాధ దంపతుల కుమార్తె మిట్టపల్లి ఐశ్వర్య నీట్ ఆలిండియా 2165వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం వైరాలోని పలువురు మిట్టపల్లి నాగేశ్వరరావు నివాసంలో ఐశ్వర్యకు శాలువా కప్పి స్వీట్ తినిపించి సన్మానించారు. కార్యక్రమంలో వజినేపల్లి చక్రవర్తి, వజినేపల్లి రవి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ముస్లిం మహిళకు తోపుడుబండి అందజేస్తున్న శ్రీనివాసరావు

వైరా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలని అందుకు తమ సంస్థ చేయూతనిస్తుందని పర్పుల్ డీఎన్ఏ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం వైరాలో జరిగిన ఒక కార్యక్రమంలో ముగ్గురు పేద మహిళలకు కుట్టుమిషన్లు, వీధివ్యాపారం చేసుకుంటున్న ఒక పేద ముస్లిం మహిళకు తోపుడుబండి అలాగే స్నానాల లక్ష్మీపురంలోని ఓ పేద రైతుకు పవర్‌స్ప్రేయర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఆ సొసైటీ ఉపాధ్యక్షుడు చౌడవరపు బద్రీనారాయణ, కవితారాణి, కోఆర్డినేటర్ పెనుగొండ ఉపేంద్రరావు, సభ్యులు మిట్టపల్లి భాస్కర్, బాబూరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బలరామ జయంతి సందర్భంగా రైతులకు సన్మానం

కొణిజర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ కృష్ణ సోదరుడు బలరామ జయంతిని పురష్కరించుకుని మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం 65సంవత్సరాలు నిండిన వృద్ధ రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ రోజ్‌గార్ ఉపాధికల్పన ప్రముఖ్ కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. సమాజంలో సినీప్రముఖులకు, రాజకీయనాయకులకు గుర్తింపు ఉంటుంది గాని రైతులకు ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఉప్పలచలక గ్రామానికి చెందిన యువరైతు సోమ దర్యాసింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, మంచి ఉదోగ్యాన్ని వదిలి వ్యవసాయం మీద ప్రేమతో డ్రాగన్ ఫ్రూట్స్ వేసి ఆదర్శంగా నిలిచాడని తెలిపారు. ఈ సందర్భంగా అతడిని కూడ సన్మానించారు. రామారావు, కవిడ మురళీకృష్ణ, బీకేఎస్ మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, కొండపర్తి నరేష్, యాసా సత్యనారాయణ, రాంబాబు, ఆదినారాయణ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక, శారీరక ధృడత్వానికి దోహదపడతాయి

వైరా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ పోటీల్లోని విజేతలకు శనివారం వైరా ఎస్ఐ రామారావు, డాక్టర్ మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్‌లో క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కోచ్ అంజద్ పాషా, నీతోడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందిగామ మనోహర్, సుందర్‌రావు, కట్ల ప్రియాంత్ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ ఆన్‌లైన్‌లో ఏఎన్‌ఎంలను తొలగించాలి



డాక్టర్ అవినాష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) ప్రోగ్రాంలోని ఆన్‌లైన్ నుంచి తమను తొలగించాలని కోరుతూ ఏఎన్‌ఎంలు గంగారంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పనిఒత్తిడితో తామంతా అనేక మానసిక రుగ్మతలకు గురవుతున్నామని, స్క్రీనింగ్ టెస్టులతోపాటు ఆఫ్‌లైన్ రిపోర్టు చేస్తుండగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడా తమనే నమోదు చేయాలనడం సబబు కాదన్నారు. కామేశ్వరి, నాగమణి, పద్మావతి, మంజుల, సునీత, లక్ష్మీ పాల్గొన్నారు.

కారేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ ప్రోగ్రాంలో ఆఫ్‌లైన్ తోపాటు ఆన్‌లైన్ కూడా చేయాలని ఏఎన్‌ఎంలపై చేస్తున్న వత్తిడిన మానుకోవాలని కోరుతూ శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్‌ఎంలు ఆందోళన చేశారు. అనంతరం మండల వైద్యులు సురేష్‌కు వినతిపత్రం అందచేశారు.

ఎంపీడీవోగా రంజిత్‌కుమార్

ఏన్కూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు నూతన ఎంపీడీవోగా భూక్యా రంజిత్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వేంసూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవో అదనపు విధులు నిర్వహిస్తున్న జీవీఎస్ నారాయణ యధాస్థానంలో డీఎల్‌పీవో విధులు నిర్వహించనున్నారు.

ప్రతీ ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలి



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

తల్లాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలని హ్యూమన్‌రైట్స్ ఫౌండర్ బొడ్డపాటి దాసు, తల్లాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ అన్నారు. శనివారం మండలంలోని బిల్లుపాడు గ్రామంలో హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తేళ్లూరి చిన్న ఏసుకుమార్తె తేజశ్రీ పుట్టినరోజు సందర్భంగా వృద్దులు, వికలాంగులు, నిరుపేదలకు విరతణ చేసిన దుప్పట్లను పంపిణీచేశారు. 22 ఏళ్లుగా తేజశ్రీ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మోదుగు జయరాజు, గౌరవాధ్యక్షుడు ఎండీ ముస్తఫా, గౌరవ సలహాదారుడు మునుకూరి అప్పిరెడ్డి, హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ మహిళ విభాగం అధ్యక్షురాలు యనముల రుక్మిణి, నాగమణి, భాను పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ముదిగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన బాణాల చక్రపాణి అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతడికి సొసైటీలో సభ్యత్వం ఉండడంతో మంజూరైన రూ.50వేల బీమా చెక్కును సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి చక్రపాణి భార్య అరుణకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బట్టు పురుషోత్తం, సీఈవో వెంకటరత్నం, సొసైటీ సిబ్బంది బాషా, మధు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఓటర్ల ముసాయిదా

- పది సంవత్సారాల క్రితం మృతి చెందిన వారి పేర్లు జాబితాలో
- పలు పార్టీల నాయకులు నిరసన



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కారేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల కోసం రూపొందించిన ఓటర్ల ముసాయిదా తప్పుల తడికల ఉందని, పది సంవత్సరాల క్రితం మృతి చెందిన వారి పేర్లను కూడా తొలగించలేదని, పెళ్లి చేసుకుని అత్తవారి ఇంటికి వెళ్ళి పదినుంచి, పదిహేను సంవత్సరాలు దాటిన ఆడ బిడ్డల ఓట్లను కూడా తొలగించకుండనే జాబితా తయారు చేశారని ఆరోపిస్తూ పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మాజీ సర్పంచ్‌లు ఆరోపించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఓటరు ముసాయిదపై సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో బీఎల్‌వోలను కాదని, పంచాయతీ కార్యదర్శులతో జాబిత తయారుచేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, సూపర్‌డెంట్ రమేష్ పాల్గొన్నారు.

ముదిగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల ముసాయిదా జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్‌స్వామి మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీ, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను ఉంచామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో వాల్మీకి కిషోర్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెనుబల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ముసాయిదాలో పలు గ్రామపంచాయతీల్లో సవరణలు చేయాల్సి ఉందని పలు రాజకీయ పక్షాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శనివారం పెనుబల్లి మండలపరిషత్ కార్యాలయంలో ఓటర్ల ముసాయిదాపై జరిగిన సమావేశంలో రాజకీయ పక్షాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన మహిళలు వివాహం అయిన తర్వాత ఆంధ్రాకు వెళ్లి అక్కడ రెండుసార్లు ఓటు వేసిన వారికి కూడా మళ్లీ ఈ జాబితాలో ఓటర్లుగా వారి పేర్లు అధికారులు నమోదు చేశారని ఆరోపించారు. సమావేశంలో ఎంపీవో జ్యోత్స్న దేవి, రాజకీయ పార్టీల నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు, పంది వెంకటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, గాయం తిరుపతిరావు, బొర్రా నర్సింహారావు, పసుమర్తి విశ్వనాథ్, కాటినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆసుపత్రి సిబ్బంది పనితీరు

మధిర రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని, ఉన్న వైద్యులు సమయానికి రారని, వచ్చినా అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తూ శనివారం మధిరలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు పాపినేని రాంనర్సయ్య మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత ఉందని, ఉన్న డాక్టర్లు కూడా సరిగా పనిచేయడం లేదని ఆరోపించారు. మధిర ప్రభుత్వ ఆసుపత్రిని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. మధిరలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని కోరారు. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

వెలుగు కార్యాలయంలో పలువురు సీసీల బదిలీ

కారేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల ఇందిరక్రాంతి పథకంలో సీసీలుగా గత 7సంవత్సరాలుగా పనిచేస్తున్న 6గురు సీసీలను అధికారులు శానివారం కౌన్సిలింగ్ నిర్వహించి, వెంటనే బదిలీ ఆర్డర్లు అందజేశారు. బదిలీ అయిన సీసీలు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో పని చేసేందుకు కోరారు. వారి కోరిక మేరకు పలు మండలాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారి స్థానంలో సోమవారం కొత్తసీసీలు వచ్చే అవకాశం ఉందని వెలుగు కార్యాలయం సిబ్బంది తెలిపారు.

విద్యతోనే ఉన్నతస్థాయిలో గౌరవం పొందగలం

- అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముదిగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నతస్థాయిలో గౌరవం పొందగలుగుతామని జిల్లా అదనపు కలెక్టర్, విద్యాశాఖ అధికారి డాక్టర్ పి.శ్రీజ సూచించారు. శనివారం ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునన్నారు. ఆశయాలు సాధించే దిశలో కష్టపడ్డప్పుడే ఏదైనా విజయం సాధించగలుగుతామని తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఆలోచించుకుంటూ కుటుంబానికి అండగా ఉంటూ విజయం వైపు పయనించాలని సూచించారు. యూపీఎస్సీ పరీక్షా విధానం, అర్హతలు, ప్రిపరేషన్ గురించి విద్యార్థులకు వివరించారు. ఆదాయ పన్నుశాఖ డిప్యూటీ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ.. అంకితభావంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునన్నారు. ఐఆర్ఎంఎస్ అధికారి తుమ్మల మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా, చెడు వ్యసనాలకు బానిసకావొద్దని, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో రవిబాబు, ఎన్నారై ట్రస్టు చైర్మన్ బాబూరావు, ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయాధికారులు

మధిర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13వ తేదీన జరిగే మెగా లోక్ అధాలత్‌ను విజయవంతం అయ్యేలా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని మధిర కోర్టు న్యాయాధికారులు ఎస్.ప్రశాంతి, వేముల దీప్తి కోరారు. శనివారం మధిర కోర్టులో న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్, కోర్టు అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజమార్గమని కక్షిదారులను ఓప్పించి లోక్ అధాలత్‌లో కేసుల రాజీ పడేందుకు కృషి చేయాలని అన్నారు. అనవసరంగా కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృదా చేసుకోవద్దని కక్షిదారులకు ఈ మేరకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అబ్రహం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భద్రయ్య సి.ఐ లు మధు, రమేష్, జనార్ధన్ రెడ్డి మధిర, ఎర్రుపాలెం, బోనకల్, మధిర రూరల్, వైరా ఎస్.ఐ లు, ఎక్సైజ్ సి.ఐ సాయిరామ్ భార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, రామరాజు, పూర్ణచందర్ రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవతో ఆత్మసంతృప్తి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సండ్రను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సత్తుపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలో ఆత్మసంతృప్తి లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లిలోని కోదండ రామాలయంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన 16వ వాసవీ గణపతి ఉత్సవాలలో పాల్గొని గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్‌లు సండ్రను శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకముందు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం, కొత్తూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. అదేవిధంగా పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఒగ్గు విజయలక్ష్మీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి మహేష్, అమరవరపు కృష్ణారావు, వల్లభనేని పవన్, నరుకుళ్ల శ్రీను, మాధురి మధు, నడ్డి ఆనందరావు, తడికమళ్ల ప్రకాశరావు, జొన్నలగడ్డ విజయ్, పెద్దిరెడ్డి పురుషోత్తం పాల్గొన్నారు.

మిర్చిసాగుపై అవగాహన



మిర్చిసాగుపై అవగాహన కలిగిస్తున్న ఏవో

ఏన్కూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చిసాగుపై రైతులకు ఏవో నరసింహారావు అవగాహన కలిగిస్తున్నారు. శనివారం జన్నారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సాగు విధానం గురించి రైతులకు వివరిస్తూ 5నుంచి 6వారాల వయస్సు గల మిర్చి నారును నాటుకోవాలని, తల్లి వేరు మడత పెట్టకుండా నాటుకోవాలన్నారు. దుక్కిలో వేరు పురుగు నివారణకు కార్బోఫిరాన్ 3జీ గుళికలు 10నుంచి 12కేజీల ఎకరానికి వేసకోవాలని సూచించారు. అదేవిధంగా 5ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ ప్లస్ 10గ్రాముల కార్బండిజం 10 లీటర్ల నీటికి కలిపి నారు మొదళ్లను 5నుంచి 10నిమిషాలు ముంచి తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవడం వల్ల రసం పీల్చే పరుగులు, భూమి ద్వారా సంక్రమించే తెగుళ్ల సమస్యలను నివారించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నవ్య, రైతులు స్వర్ణ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి

తల్లాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గతకొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతలో వివిధ పంటలను ఆశిస్తున్న చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శనివారం తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామంలో వరిపైరును వారు పరిశీలించి రైతులకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు ఆశించిందని దీనివల్ల ఆకు చివరినుండి కిందివరకు తడిచినట్టుగా ఉండి పసుపురంగుకకి మారి ఆకులు ఎండిపోయి మొక్కలు చనిపోతాయని దీని నివారణకు తెగులు 5శాతం కంటే ఎక్కువయితే నత్రజని వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. తెగులు వ్యాప్తిని అరికట్టటడానికి అగ్రిమైసిన్ 0.4గ్రామాలులేదా పన్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2 గ్రాములు 5నుండి 7రోజుల వ్యవధిలో రెండసార్లు పిచికారి చేయాలని అవసరమైన సలహాలకు తమను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాస్త్రవేత్తలు డాక్టర్ సుచరితేదవి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ టి.పావని, పీఎస్‌ఎం ఫణిశ్రీ, కృషివిజ్ఞానకేంద్రం మండల వ్యవసాయాధికారి ఎండీ తాజుద్దీన్, ఏవో ఎండీ తాజుద్దీన్, ఏఈవో త్రివేణి, రైతులు కళ్యాణపు వెంకటేశ్వరరావు, కళ్యాణపు కృష్ణయ్య, నాయుడు శ్రీను, మధు పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలి

కల్లూరు, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి) ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షదారులకు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండు చేశారు. శనివారం కల్లూరులో పెన్షన్‌దారుల సన్నహక సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే పెన్షన్ దారులకు పెన్షన్ పెంచుతామని మాయమాటలు చెప్పి మోసగించిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 65 లక్షల మంది పెన్షన్‌దారుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు వారి సమస్యపై మాట్లాడకపోవటం విచారకరమని ఆయన విమర్శించారు. సమాజంలో ఏ వర్గానికైన, మతానికైన ఆన్యాయం జరిగితే కచ్చితంగా ఎమ్మార్పీఎస్ వారికి అండగా నిలుస్తుందన్నారు.ఈ సభలో సెప్టెంబరు 9తేదీన హైదరాబాద్‌లో జరగనున్న సింహాగర్జన సభకు సంబంధించి బిజెపి తరఫున మద్దతు తెలుపుతూ తయారు చేసిన పోస్టర్‌ను ఆ పార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామాలింగేశ్వరరావు, నాయకులు తుమ్మలపూడి పుల్లారావు, సుబ్బారావులు కృష్ణమాదిగకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కారుమంచి వెంకటేశ్వర్లు జాతీయ మహిళా నాయకురాలు సామినేని భవానీచౌదరి, నాయకులు ఎం వెంకటేశ్వర్లు, సీతారెడ్డి, రాణి, ముత్తారావు, దారెల్లి వెంకటేశ్వరరావు, నల్లగట్ల కోటేశ్వరరావు, వెంగల వెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



చవితి మండపాల వద్ద అన్నదానం

వినాయక చవితి సందర్భంగా చవితి మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణపతికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలతో పాటు మండపాల వద్ద భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ఆర్టీసీ డిపోలో అన్నదానం ప్రారంభిస్తున్న డీఎం



వైరాలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



మధిరలోని రొంపిళ్లమల్లలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పాతర్లపాడులో అఖిలపక్షం ఇంటింటి సర్వే

చింతకాని, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వర్షాలక లోతట్టు ప్రాంతాల ఇల్లలోకి వరద నీరు చేరుతుందన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు సామినేని అప్పారావు, తాళ్లూరి యాదగిరి, మండెపూడి కృష్ణారావు, కాటబత్తిన వీరబాబు, రమేష్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరు వెంకటేశ్వర్లు, మున్నా రామకోటయ్య, వంగా గోపయ్య, ఓబెనబోయిన అచ్చయ్య, రామారావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వకారణం

సత్తుపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): విద్యలో రాణిస్తూ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వకారణమని, కష్టపడి చదివి డాక్టరుగా పేదవారికి ఆపన్నహస్తం అందించాలని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మీ అన్నారు. రాజమండ్రి జీఎస్ఎల్ కళాశాలలో సీటు సాధించిన స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్‌డీఐగా పనిచేస్తున్న వింజమూరి ప్రభాకర్, కవిత దంపతుల కుమార్తె మాధురిని శనివారం డిపో మేనేజర్ శాలువాతో ఘనంగా సన్మానించారు.



సృజనాత్మకత పరిశోధనలో ప్రతిబింబిస్తుంది



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలు వారి పరిశోధనలలో ప్రతిబింబిస్తాయని మదర్‌తెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు అన్నారు. శనివారం బీటెక్ ఫైలనీయర్ మొదటి సెమిస్టర్ విద్యనభ్యసిస్తున్న ఈసీఈ, ఈఈఈ విభాగాలకు చెందిన విద్యార్థులు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌ను ఉపయోగించుకొని నిత్య జీవితంలో ప్రజలకు ఉపయోగపడే నమూనాలను రూపొందించారు. రియల్ టైం అప్లికేషన్స్ ఆల్కహాల్ డిటెన్షన్, వెదర్ మానిటరింగ్, ఇంటిలిజెన్స్ వాయిస్ మానటరింగ్, వైర్లెస్ గ్యాస్ డిటెక్షన్ రోబో, వాటర్ ట్యాంక్ లెవెల్ మానటరింగ్, రియల్ టైం ప్రొటెక్షన్ సిస్టం ఫర్ ఉమెన్ సేఫ్టీ, కోల్‌మైన్ సెంటిలైన్ తదితర అంశాలకు చెందిన నమూనాలను రూపొందించారు. విద్యార్థుల తరగతికే పరిమితం అవ్వకుండా తమ ఆలోచనలు, ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, ప్రాజెక్ట్ ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ వై.రాజశేఖరరెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ జీ.ఉదయ్‌కిరణ్‌భార్గవ్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మధిర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకుని సీపీఎస్ రద్దు చేసే వరకు ఉపాధ్యాయుల పోరు ఆగదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శేఖర్ రావు, ఆర్.రంగారావు అన్నారు. సీపీఎస్ రద్దు కోరుతు పీఆర్టీయూ సెప్టెంబరు ఒకటిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద పీఆర్టీయూ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతు పీఆర్టీయూ మధిర డివిజన్ ఆధ్వర్యంలో శనివారం మధిరలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు శరాఘాతంగా మారిందని ఎన్నికల ముందు ఇచ్చిన హమీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి నాయకులు రవికుమార్, శాంతబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.